సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శనివారం, 9, డిసెంబర్, 2023



మహా గురుకులం ప్రారంభానికి సిద్ధం

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో మహా గురుకుల పాఠశాల ఏర్పాటైంది. రూ. 21 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. -8లో



సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

సామాజిక న్యాయం సీఎం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.2/24.3

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 24.3 – 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

అభివృద్ధి పథంలో రాష్ట్రం



మాట్లాడుతున్న ఓపెన్‌మైండ్స్ అధ్యక్షుడు డా. ఎస్. రాజశేఖరరెడ్డి



సదస్సుకు హాజరైన విద్యార్థులు, మేధావులు తదితరులు

- విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- 'ఓపెన్ మైండ్స్'సెమినార్‌లో వక్తలు

వైవీయూ: విద్య, వైద్య రంగాలతో పాటు సంక్షేమ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, ప్రాధాన్యత ఫలితాలు..రానున్న రోజుల్లో కనిపిస్తాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సుస్థిరమైన అభివృద్ధి సాధిస్తోందని పలువురు వక్తలు, యువత పేర్కొన్నారు. కడప లోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 'ఓపెన్ మైండ్స్'(ఫార్ బెటర్ సొసైటీ) స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో 'విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో వినూత్న మార్పులు – సుస్థిర అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్'అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓపెన్ మైండ్స్ సంస్థ ప్రెసిడెంట్, ఏపీ ఉన్నతవిద్య మానిటరింగ్ కమిటీ పూర్వపు సీఈఓ, మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్. రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజాహిత కార్యక్రమాలు, సమస్యలపై పోరాటం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా, ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఏర్పాటైన సంస్థ ఓపెన్ మైండ్స్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన గొప్ప మార్పులు, సంస్కరణలపై అవగాహన కల్పించడంతో పాటు ఏవైనా పొరపాట్లు, సవరణలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే లక్షమన్నారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాల కాలంలో ఎక్కువగా పారిశ్రామీకరణ, వ్యవసాయ రంగాలకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్య, వైద్య, సంక్షేమాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అయినప్పటికీ కొందరు ఈ రంగాలకు ప్రాధాన్యతను ఇవ్వడాన్ని విమర్శించడం సరికాదన్నారు, ప్రజలు, యువత, మేధావులు సరైన దిశగా సానుకూల దృక్పథంతో ఆలోచన చేసి, జరుగుతున్న అభివృద్ధిపై విశ్లేషించుకోవాలన్నారు.విద్యపై పెడుతున్న ఖర్చును పెట్టుబడిగా భావించాలని రానున్న రోజుల్లో అత్యున్నత మానవ వనరులను, మేధోసంపత్తిని దేశం పొందుతుందన్నారు.వైద్యరంగంలో ఆరోగ్యశ్రీకి మహానేత వైఎస్ఆర్ శ్రీకారం చుడితే.. దాన్ని సీఎం వైఎస్ జగన్ మరింత బలోపేతం చేస్తూ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి పథకాలతో ప్రజలకు మరింత దగ్గరయ్యారన్నారు. ఇప్పటి వరకు 11 మెడికల్ కళాశాలలు ఉండగా, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చట్టడం, దాదాపు 6వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి రానుండటం ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఎక్కువ విమర్శలు ఎదుర్కొంటున్న రంగం సంక్షేమరంగమన్నారు. ఉచితాలు ఇస్తున్నారని విమర్శలు చేసేవారు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో 1.25 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2 లక్షల మంది వలంటీర్లను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న సుపరిపాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లడం కన్నా అభివృద్ధి ఏముంటుందని ప్రశ్నించారు. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా. ఎస్. ఈశ్వరరెడ్డి, విశ్రాంత ఆచార్యులు డా. గులాంతారీఖ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, శ్రీహరి డిగ్రీ కళాశాల అధినేత జి. సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు ఎస్.వి. డిగ్రీ కళాశాల అధినేత హరినారాయణ పాల్గొన్నారు.

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి..విద్య



విద్యనే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు ఏ సీఎం ఇవ్వని ప్రాధాన్యతను విద్య, వైద్యరంగాలకు ఇస్తున్నారు. ఒకప్పటి ప్రభుత్వ పాఠశాలలకు, నాడు–నేడు తర్వాత ప్రభుత్వ పాఠశాలలను చూస్తే అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీసుకురాగా, దానిని మరింత మెరుగుపరిచి నిబంధనలు లేకుండా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలు సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. – చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్

దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్



తెలుగుమీడియంలో చదువుకుని ఇంగ్లీషు మాట్లాడటంలో తడబడ్డ మాలాంటి వారెందరికీ ప్రభుత్వం ఇప్పుడు తీసుకువచ్చి ఇంగ్లీషు మీడియం పాఠశాలలను చూస్తే సంతోషం కలుగుతోంది. న్యాయవాదుల కోసం రూ.5వేలు చొప్పున లా నేస్తం పథకం ద్వారా అందించడం చారిత్రాత్మం వినూత్న సంస్కరణలకు కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని స్థిరమైన అభివృద్ధి సాధించాలి. – రాఘవరెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

పరిపాలనను గమనించాలి



రాజకీయ పార్టీల గురించి, చరిత్ర, విశ్వసనీయత, పరిపాలన గురించి విద్యార్థులు నిశితంగా పరిశీలించాలి. ప్రతి విద్యార్థి ఓపెన్ మైండ్‌తో ఆలోచిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, అందిస్తున్న పథకాల గురించి అర్థమవుతుంది. రాష్ట్రంలో ప్రతి పథకం సక్రమంగా ప్రజలకు చేరుతున్నాయంటే పరిపాలన ఎంత పకడ్బందీగా, పారదర్శకంగా ఉందో అర్థం చేసుకోవాలి. – జయసింహ, ఇన్‌చార్జి స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి, కడప కేంద్రం

వైఎస్ఆర్ కలను.. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు



రాష్ట్రంలో పాఠశాలవిద్యలో ఇంగ్లీషు మీడియం పాఠశాలలు నెలకొల్పాలన్న వైఎస్ఆర్ కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. పేదవాళ్లు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించడం, వారికి సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి అభినందనలు. అప్పుల గురించి చాలామంది మాట్లాడుతున్నారు. పరిపాలనలో అది అత్యంత సహజమైన విషయం – పోచంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

మహిళా సాధికారతకు పెద్దపీట



విద్య, వైద్యం, సంక్షేమ రంగాలతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్, అన్నింటా మహిళలకు రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో సైతం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరం. గతంతో పోల్చితే నేడు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాం. విద్యారంగంలో ఎవరూ తీసుకురానన్ని మార్పులు తేవడంను యువత ఆహ్వానిస్తోంది. – కవిత, సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు

అన్ని సౌకర్యాలు పొందుతున్నాం..



ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను అందిపుచ్చుకుని విద్యాభ్యాసం చేస్తున్నాం. మేము పాఠశాలలో చదివే సమయంలో ఇప్పుడున్నన్ని సౌకర్యాలు లేవు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చింది. విద్యతోనే ప్రగతి సాధ్యమని నమ్మే పాలకులు ఉండటం మనందరి అదృష్టం. ప్రభుత్వంపై చేసే ఫేక్ ప్రచారాలకు యువత దూరంగా ఉండాలి. – సుదీప్తి, బీటెక్, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, కడప

న్యూస్‌రీల్

రెండు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్:జిల్లాలోని రెండు మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. వేముల మండలంలో 31.4, పులివెందులలో 8 ఎంఎం వర్షపాతం నమోదైంది. శనగ, ఇతర ఆరుతడి పంటల సాగుకు ఈ వర్షం అనుకూలించనుంది.

బీసీ కార్పొరేషన్ ఈడీగా జయసింహ



కడప రూరల్: బీసీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జయసింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యసాయి జిల్లా మడకశిరలో డ్వామా ఏపీడీగా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈడీగా వ్యవహరించిన జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఈడీ బ్రహ్మయ్య స్థానంలోకి జయసింహ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

లేబర్ సెస్సు వసూలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: లేబర్ సెస్సును వసూలు చేసి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. భవన, ఇతర నిర్మాణ పనుల్లో భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు.

12న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కలెక్టరేట్‌లో తమ కార్యాలయంలో ఈనెల 12న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు మంగళవారం జరిగే ఇంటర్వ్యూలకు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో రావాలన్నారు.

ఇంటర్ ఫీజు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నెల 11వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐవో రమణరాజు తెలిపారు. వాస్తవానికి పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ముగిసినా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు, గతంలో ఫెయిలైన వారు, ప్రైవేటు విద్యార్థులు సైతం ఫీజులు చెల్లింపు చేసుకోవచ్చన్నారు.

తప్పులు సవరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులు ఎస్ఎస్‌సీ బోర్డుకు సమర్పించిన దరఖాస్తుల్లో తప్పులుంటే సవరించుకునేందుకు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు బోర్డు అవకాశం కల్పించిందని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. విద్యార్థి తల్లితండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫొటో, సంతకం, మొదటి, రెండో భాష సబ్జెక్టు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

11న గండిలో టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధికి సంబంధించి ఖాజీపేట,చక్రాయపేట మండలాల్లో ఉన్న భూమిని కౌలుకు ఇచ్చే నిమిత్తం ఈనెల 11న షీల్డ్ టెండరు, బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.ఖాజీపేట మండలంలో ఉన్న 1.55 ఎకరాలు, చక్రాయపేట మండలంలోని 0.10 సెంట్ల భూమిని 2 సంవత్సరాల కాల వ్యవధితో ఇవ్వనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రు.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.అలాగే సంవత్సర కాలం పాటు స్వామి వారి అలంకరణకు పూలు సరఫరా చేయడానికి రు.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పరీక్షలు వాయిదా

వైవీయూ: వైవీయూ అనుబంధ డిగ్రీ కళాశాలల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 15 తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు వాయిదా వేశామని వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎస్.ఈశ్వర్ రెడ్డి తెలి పారు. ఈ పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయన్నారు. పలు కళాశాలల నుంచి వచ్చిన వినతుల మేరకు వీసీ చింతా సుధాకర్, కుల సచివులు వై.పి.వెంకటసుబ్బయ్యలు పరీక్షల తేదీల్లో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. పరీక్షల తేదీవారీగా టైం టేబుల్ సంబంధిత కళాశాలలకు పంపామన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను పరీక్షల ప్రారంభానికి ముందు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి తీసుకోవాలని సూచించారు.

అన్ని పత్రాలు తప్పనిసరి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి వాహనదారుడు తమ వాహనం యొక్క అన్ని రకాల పత్రాలను కలిగి ఉండటం తప్పనిసరి అని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరాప్రసాద్ సూచించారు. కడపలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనం యొక్క అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. ల కాగా, 2021 ఆగస్టు నుంచి 2023 జులై వరకు పెండింగ్‌లో ఉన్న డ్రైవింగ్, ఆర్సీ కార్డులను ప్రింట్ చేసి వాహనదారులకు పోస్ట్ ద్వారా పంపడం జరిగిందన్నారు. విద్యార్థులను తరలించే వాహనాలు, టాక్స్‌లు చెల్లించని వాహనదారుల కోసం ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రొద్దుటూరులో సినీ తారల సందడి





షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన రష్మి, మాట్లాడుతున్న సినీ నటి పాయల్ రాజ్‌పుత్

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. సినీ నటీమణులు పాయల్ రాజ్‌పుత్, రష్మి చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై అభిమానం చూపి స్వాగతం పలికిన ప్రొద్దుటూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 28 బ్రాంచిలను ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రొద్దుటూరులో 29వ బ్రాంచి తమ చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అందరికి అందుబాటులో ధరలు, మన్నికకు మారుపేరుగా సీఎంఆర్ షాపింగ్ మాల్ నిలుస్తుందన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ, వెంకటపద్మావతి, వెంకటబాలాజీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలను నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మునీర్, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. శుక్రవారం ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పట్టణంలోని మెడికల్ కళాశాల, మండల మినీ సెక్రటేరియట్, సెంట్రల్ బోలే వార్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశలలో జరుగుతున్న పనులు వాటికి కేటాయించిన గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సిటీ సెంట్రమ్, సెంట్రల్ బోలేవార్డు, మండల మినీ సెక్రటేరియట్‌లో జరుగుతున్న పనుల తీరుపై అధికారులతో వన్ టు వన్ సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పట్టణంలో పనులు చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

వేంపల్లె: అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు అధికారులను ఆదేశించారు. ఇడుపులపాయలో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్సార్ మెమోరియల్ పార్కు పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అంతలోపు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులకు ప్రాధాన్యత

- వాటర్‌షెడ్‌లో చకచకా పనులు
- బడ్జెట్‌లో 47 శాతం నిధులు
- పనులు పూర్తి చేసి గ్రామ పంచాయతీలకు అప్పగింత
- ఇప్పటివరకు రూ.10.96 కోట్లతో 537 పనులు





బి.కోడూరు మండలం పెదుళ్లపల్లెలో కొండకు ఏర్పాటు చేసిన విదిరాళ్ల కట్టడాలు, ట్రెంచులు, లింగాల మండలంలో ఓ వంకలో నిర్మించిన చెక్‌డ్యామ్

కడప సిటీ: మానవ మనుగడకు సహజ వనరులు అవసరం. భూమి, నీరు, వృక్ష సంపద తదితర ప్రాణాధార సహజ వనరులు మానవుని ఆవాసానికి ప్రధానమైనవి. పునరావృతం కాని వీటిని రక్షించుకుని సక్రమమైన మార్గంలో యాజమాన్యం చేయడం వల్ల జీవన ప్రమాణాలు ఆధారపడి ఉంటాయి. అందులో భాగంగానే వాటర్ షెడ్ పథకంలో ప్రభుత్వం 'సహజ వనరుల యాజమాన్యం'(న్యాచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్) విధానాన్ని తీసుకొచ్చింది. ఈ పద్ధతిలో ఆయా గ్రామాల్లో సహజ వనరులను అభివృద్ధి చేసి గ్రామ పంచాయతీకి ఆస్తిగా అందజేస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో వాటర్‌షెడ్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆహారం, నీరు, పశువుల మేత తదితర నిత్యావసరాలు నానాటికి పెరుగుతున్నాయి. భూమి ఆధారిత వనరులను అమితంగా వినియోగించడం వల్ల ప్రకృతి సమతుల్యత యంత్రాంగానికి భంగం కలుగుతోంది. అందువల్ల భూసార సంరక్షణ, అడవుల పెంపకం, నీటి నిల్వ పనులు, నేలకోత నివారణ పనులు, పశు పోషణ, పండ్ల తోటల పెంపకం, రైతు అవసరాలు తీర్చే పనులను సహజ వనరుల యాజమాన్య కార్యక్రమం కింద ప్రజల భాగస్వామ్యంతో ఎంపిక చేసిన వాటర్‌షెడ్ ప్రాంత గ్రామాల్లో నిర్వహిస్తున్నారు.

- వాటర్‌షెడ్–పీఎంకేఎస్‌వై 2.0లో భాగంగా సహజ వనరుల యాజమాన్యం కింద వివిధ పనులు చేపడుతున్నారు. జిల్లాలో వాటర్‌షెడ్‌లో చేపట్టిన పనులకు బడ్జెట్‌లో 47 శాతం నిధులు కేటాయించారు. ఈ నిధులతో నేలకోత నివారణ, నీటి నిల్వ పనులు, భూసార సంరక్షణ, అటవీకరణ పనులు చేస్తారు.

రైతులకు ఉపయోగకరం

సహజ వనరుల నీటి యాజమాన్యం పథకం ద్వారా చేపడుతున్న పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వీటిని అభివృద్ధి చేయడం వల్ల రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో కురిసిన వర్షం కారణంగా చెరువులు, కుంటలు నీటితో నిండాయి. భూగర్భజలాలు పెరగడంతో చెక్‌డ్యాములు, ఊట కుంటలు, పారంపాండ్స్‌లో ఉన్న నీటిని ఉపయోగించుకుని రైతులు వ్యవసాయం చేసేందుకు అనుకూలతగా మారింది.

పకడ్బందీగా

సహజ వనరుల నీటి యాజమాన్యం పనుల్లో ఎక్కడా అవినీతి, అక్రమాలు జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా జియో ట్యాగింగ్ చేయడం జరుగుతుంది. సామాజిక తనిఖీ విభాగం చేత ఆడిట్ కూడా చేసి చూపిస్తారు. వాటర్‌షెడ్ కాల పరిమితి పూర్తయిన తర్వాత ఆ పనులన్నింటినీ గ్రామ ఆస్తిగా పరిగణించి వాటి సంరక్షణ, నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీకి అప్పజెబుతారు.

▶▶ పనులిలా...



ఈ పథకం కింద వైఎస్సార్ జిల్లాలో పనులు చేసేందుకు రూ. 40.95 కోట్లు బడ్జెట్ కేటాయించారు. ఇందులో ఇప్పటికే రూ.12.19 కోట్లు ఖర్చు చేసి 632 పనులను చేశారు. ఇందులో నేలకోత నివారణ పనులు అంటే కొండపై ట్రెంచులు, రాతి కట్టడాలు, గాబియన్స్ పనులను రూ. 1.20 కోట్లతో 94 చేయడం జరిగింది. అలాగే నీటి నిల్వ, భూసార సంరక్షణ పనుల కింద డగౌట్ పాండ్స్, ఊటకుంటలు, చెక్ డ్యాములు, చెక్‌వాల్స్, అమృత్ సరోవర్స్, రైతు పొలాల్లో పారం పాండ్స్ పనులను రూ. 10.96 కోట్లతో 537 చేశారు. అటవీకరణ, పండ్ల తోటల పెంపకం పనులకు అనుమతులు రావాల్సి ఉంది.

ముమ్మరంగా పనులు



ప్రస్తుత తరుణంలో ప్రకృతిలో సహజ వనరులు దెబ్బతింటున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు సహజ వనరుల నీటి యాజమాన్యం పథకం ఎంతో ఉపయోగపడుతోంది. జిల్లాలో ఈ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మిగిలినవి కూడా త్వరలో చేపట్టి రైతాంగానికి మేలు చేసేలా చర్యలు చేపడతాం. – పి.యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

సమాచారం ఆన్‌లైన్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ యాజమాన్య పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్ఐవో రమణరాజు, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డిలు సూచించారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో పాఠశాల విద్య పరిధిలో ఇంటర్ వరకు నిర్వహించే స్కూల్స్‌కు సంబంధించిన ప్రిన్సిపాల్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శుక్రవారం 'యు డైస్ ప్లస్' పైన ఒక్కరోజు వర్క్ షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లో విద్యార్థులతో పాటు మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కాగా, యూ డైస్ ప్లస్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసే విధానాలపై డీఈఓ కార్యాలయ యు డైస్ ప్లస్ ఆర్గనైజర్స్ విశ్వనాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జ్వాలాపతిలు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సిబ్బందికి 'గ్రీవియన్స్‌డే' నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

ఉరి వేసుకొని ఆత్మహత్య



ఫర్వీన్ భాను మృతదేహం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన ఎస్.ఫర్వీన్ భాను (34) అనే వివాహిత ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మైలవరం ఎస్ఐ వెంకటకృష్ణయ్య శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన ఎస్.మాబువల్లికి ప్రొద్దుటూరుకు చెందిన ఫర్వీన్‌భానుతో 14 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఒక కూతురు కలరు. మాబువల్లి మగ్గం వృత్తి చేసుకొని తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. కొంత కాలం నుంచి సంసారం పక్కన పెడదామని భర్త మాబువల్లితో ఫర్వీన్ భాను చెప్పడం జరుగుతుండేది. ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి షేక్ ఖాజహుసేన్ ఫిర్యాదు చేశారు.

మహా గురుకులం..
ప్రారంభానికి సిద్ధం

- రూ.21 కోట్లతో భవనాల నిర్మాణం
- 5 నుంచి 10 వరకు ఇంగ్లిషు మీడియంలో బోధన
- 1000 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం



తోట్లపల్లెలో నూతనంగా నిర్మించిన మహాగురుకుల పాఠశాల భవనం



భోజనశాల



క్వార్టర్స్

బ్రహ్మంగారిమఠం : ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో మొట్టమొదటగా మహా గురుకుల పాఠశాల ఏర్పాటైంది. ఇందుకోసం బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె దగ్గర రూ.21 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. 2016లో ప్రభుత్వం మహాగురుకుల పాఠశాల మంజూరు చేసింది. మొదట నాబార్డు నిధుల ద్వారా చెల్లింపు ఉంటాయన్నారు. కొన్ని కారణాల చేత నాబార్డు తొలగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ నిధుల ద్వారా భవన నిర్మాణ పనులు చేపట్టారు. బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డికి చెందిన కంపెనీ పనులను దక్కించుకోగా, కాంట్రాక్టర్ బోయిల్లవారిపల్లె శేఖర్‌రెడ్డి చేశారు. ఈ నెలలోనే పాఠశాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అధికారులను ఆదేశించారు.

అధునాతన సౌకర్యాలు

నూతన పాఠశాల భవనంలో 1000 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది. అధునాతన హాస్టల్, భోజనశాల, లైబ్రరీ, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, వాచ్‌మెన్లకు అన్ని సౌకర్యాలతో క్వార్టర్స్, విద్యార్థులకు విశాలమైన ఆట స్థలం ఏర్పాటు చేశారు.

మూడేళ్లుగా..

మూడేళ్లుగా మహాగురుకుల పాఠశాలను అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 125 మంది పిల్లలు బి.మఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. అక్కడ ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనతోపాటు వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇతర జిల్లాల విద్యార్థులు చేరవచ్చు

నూతన మహాగురుకుల పాఠశాలను ప్రారంభిస్తే.. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరగాలి. అలాగే దాదాపు 25 మంది ఉపాధ్యాయులు, ఒక ప్రిన్సిపాల్, ఐదుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులు, ముగ్గురు వాచ్‌మెన్లు కావాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. మన జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన పేద విద్యార్థులు ఇక్కడ చదువుకొనే అవకాశం ఉంది. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి స్పందించి వచ్చే విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య పెరిగేలా అధికారులపై ఒత్తిడి తేవాల్సి ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9న (శనివారం) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. మరింత సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 08562- 258622, 244622 ఈమెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఈ కోర్ట్స్.జీవోవి.ఇన్/కేడీఏపీపీ, డీఎల్ఎస్ఏకెడీపీ అట్‌దిరేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్. కక్షిదారులు జాతీయలోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందవచ్చును. న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంక్, ఇన్సూరెన్స్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు జాతీయలోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ములకలచెరువు : కదిరినాథునికోట పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన అజ్మీర్ (47) సుమారు 20 సంవత్సరాలుగా ములకలచెరువులో హోటల్ నడుపుకుంటూ, కోళ్ల ఫారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం సొంత పని మీద తన గ్రామానికి వెళ్లి వస్తుండగా స్థానిక కేజీఎస్ కల్యాణ మండపం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన స్థలానికి ఎస్సై గాయత్రి చేరుకొని బాధితుడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంత ఇంటిని నిర్మించుకున్నాం



జగనన్న ప్రభుత్వం వచ్చాక నేను సొంత ఇంటిని నిర్మించుకున్నాను. గత కొంత కాలంగా బాడుగ ఇంటిలో నివాసం ఉండేవాళ్లం. ఇల్లు కావాలని ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నాను. ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవు. మా గ్రామ వలంటీర్ కొత్తగా ప్రభుత్వ ఇళ్లు వచ్చాయి, నిర్మించుకుంటావా అని అడిగారు. వెంటనే సంబంధిత పత్రాలను వలంటీర్‌కు ఇచ్చాను. ఆ తర్వాత ఇల్లు మంజూరు కావడంతో పనులు ప్రారంభించాం. ఇంటి నిర్మాణం పూర్తయింది. దీంతో చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

- బషీరున్, టంగుటూరు గ్రామం, రాజుపాళెం మండలం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మనబడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలన్నీ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఇంగ్లిషు మీడియం బోధన చాలా ఉపయోగకరం. జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు మూడు రోజులు రాగిజావ, మిగతా రోజులు చిక్కీలు ఇవ్వడం వారి శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుంది. ఉపాధ్యాయులకు తక్కువ పిరియడ్లు కేటాయించడం వల్ల బోధన, సాధన ద్వారా మరింత మంచి ఫలితాలు సాధించవచ్చు.

- అట్లా నరసింహారెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం, ప్రొద్దుటూరు

ఇంటికే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



నా పేరు కె.మురళి. గిడ్డంగి వీధి, కమలాపురం పట్టణం. మా తండ్రి రాజా ఇటీవల మృతి చెందారు. మేము నలుగురుం అన్నదమ్ములం. ఒక అక్క ఉంది. అయితే ఇటీవల కాలంలో ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్ ఆవశ్యకత అంతా ఇంతా కాదు. మా నాన్న మరణించిన తర్వాత వలంటీర్ రమణ మా ఇంటికి వచ్చి అతడే దరఖాస్తు పూరించి కేవలం రెండు రోజుల్లోనే ఇంటికే సర్టిఫికెట్ తెచ్చి ఇచ్చాడు. గతంలో నేను చదువుకునే రోజుల్లో క్యాస్ట్, ఇన్‌కం, రెసిడెన్స్ సర్టిఫికెట్ల కోసం కాళ్లరిగేలా తిరిగినా వచ్చేవి కాదు. పైగా డబ్బులు ఖర్చు అయ్యేవి. ఇపుడు జగనన్న సీఎం అయ్యాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా ఇంటికే సర్టిఫికెట్లు పంపిణీ చేయడం హర్షణీయం.

-కె. మురళి, గిడ్డంగి వీధి, కమలాపురం

విజిలెన్స్ దాడుల్లో బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొత్తపల్లె క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి, వెంకటేష్ వద్ద నుంచి 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వేకువజామున దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి వద్ద నుంచి వాహనంతో సహా 50 రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు వెంకటేష్‌పై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించామన్నారు. తనిఖీల్లో టి.రెడ్డప్ప, ప్రొద్దుటూరు వి.సాయిప్రసాద్, సిబ్బంది డి.హరినాథరెడ్డి, పి. సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఏ విద్యార్థిని ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామంలో సీఏ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లెల గ్రామానికి చెందిన బలక రమేష్, సునీత దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. పొలం పనులు చేసుకుని పిల్లలను చదివించేవారు. పెద్ద కుమార్తె స్వాతి (21) గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర ఫౌండేషన్ కళాశాలలో సీఏ చదువుతుండగా, రెండో కుమార్తె బీటెక్, చిన్న కుమారుడు 6వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో సీఏ చదువు పూర్తి చేసుకున్న పెద్ద కుమార్తె స్వాతి గుంటూరు నుంచి 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చింది. ఈ తరుణంలో గురువారం సాయంకాలం నీ చదువు కోసం రూ.లక్షలు ఖర్చు చేశాం, పరీక్షలు బాగా రాశావా తల్లీ, గతంలో లాగా కాకుండా, ఈ సారైనా పాస్ అవుతావా అని కన్నవాళ్లు స్వాతిని ప్రశ్నించారు. లేకుంటే మంచి సంబంధం చూసి వివాహం జరిపిస్తామని సున్నితంగా సూచించారు. సదరు యువతి ఏమనుకుందో ఏమో, పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో, లేదా కన్నవాళ్ల ఆశలు నెరవేర్చలేనేమో అని అనుకుందో గాని క్షణికావేశంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

సవాళ్లు అధిగమించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ అస్తిత్వ పోరాటానికి సవాళ్లు ఎదురవుతున్నాయని, ఆ సవాళ్లను అధిగమించడానికి చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. ప్రొద్దుటూరులోని సృజన సామాజిక వేదిక కార్యాలయంలో 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ సభకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి రాసిన 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' అనే పుస్తకంలో నీటి లెక్కలతో సహా వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం ఉందన్నారు. రాయలసీమ వెనుకబాటుకు ముఖ్య కారణం ప్రజలకు అవగాహన కొరవడటమేనన్నారు. రాజకీయ అవసరాల కోసం తప్ప ప్రజా సంక్షేమం, ప్రాంత సమగ్ర అభివృద్ధి పట్ల పార్టీలకు స్పష్టత లేదన్నారు. రాయలసీమ ఉద్యమం ఈ ప్రాంత వెనుకబాటుతనంపై విస్తృత అవగాహనను పెంపొందించిందన్నారు. దీనిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా దశరథరామిరెడ్డి రచించిన 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ హమీద్, రాష్ట్ర కో-కన్వీనర్ మహమూద్, సృజన సామాజిక వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, పౌరహక్కుల కమిటీ సభ్యుడు సురేష్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి శక్తి కార్యదర్శి హరిత, రాయలసీమ మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, చైతన్య మహిళా సంఘం కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని మహిళ మృతి

కేవీపల్లె : రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన నారమాకులవడ్డిపల్లె బస్టాప్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని నారమాకులవడ్డిపల్లెకు చెందిన రేపన శ్రీనివాసులు, ఆయన కుమారుడు చిన్నరెడ్డెప్ప ద్విచక్రవాహనంలో పీలేరు వైపు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో సుండుపల్లె మండలం బాగంపల్లెకు చెందిన సైఫుల్లా, తల్లి చాంద్ బేగం (60) పీలేరు వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. రాగులరేకులమిట్ట డౌన్‌లో రెండు వాహనాలు ముందు వెనుక వెళుతున్నాయి. ఈ సమయంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనం నారమాకులవడ్డిపల్లె వైపు తిప్పడంతో వెనుక వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొని బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చాంద్‌బీ అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిని ముగ్గురు గాయపడడంతో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

- సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి

కమలాపురం : సామాజిక న్యాయం ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యం అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ రాష్ట్ర సలహాదారు రాజోలి వీరారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి వారిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ అంటూ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఏ సీఎం చేయనంతగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరుగులు పెట్టించిన జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఐదుగురు ఉప ముఖ్యమంత్రులుంటే అందులో నలుగురు ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఉన్నారన్నారు. మంత్రి వర్గం కూర్పు నుంచి గ్రామ స్థాయి వరకు రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కూడా అందరిలాగే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగనన్న లక్ష్యం అన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బస్సు యాత్ర ఈ నెల 10వ తేదీన చెన్నూరు మండలంలో వైఎస్సార్ నిర్మించిన కొండపేట వంతెనపై జరుగుతుందన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రతి కార్యకర్త హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ హార్టికల్చర్ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, స్టేట్ మైనారిటీ కార్పొరేషన్ మెంబర్ హిదాయత్, అన్ని మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్టేట్ మైనింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సాధిక్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భూ హక్కు చట్టం రద్దు చేయాలి



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం -2022ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వీరాఘవరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రజాసంఘాలు కడప నగరంలో శుక్రవారం సాయంత్రం నిరసన ర్యాలీ చేపట్టారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణ నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్, ఏడు రోడ్ల కూడలి, వన్‌టౌన్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ భూహక్కు చట్టం వలన ఆస్తి హక్కును నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేసి రెవెన్యూ అధికారులను ట్రిబ్యునల్ చైర్మన్‌గా పెట్టి వారికి అప్పగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై.టీ కెనడీ, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ మహిళా న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, జిల్లాలో వున్న ప్రొద్దుటూరు నుంచి అబిద్ హుస్సేన్, జమ్మలమడుగు నుంచి దేవగుడి నారాయణరెడ్డి, బద్వేల్ నుంచి బ్రహ్మనందరెడ్డి, మైదుకూరు నుంచి పి.నారాయణరెడ్డి, రాజంపేట నుంచి సురేంద్రబాబు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, వారి న్యాయవాదులు, ఐఏఎల్ కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



మాట్లాడుతున్న రవిబాబు

బ్రహ్మంగారిమఠం : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఏపీసీఆర్‌ఫీఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ రాయలసీమ జోన్ చైర్మన్ ఎన్.రవిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వసతి గృహంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కళ్యాణ్, రాయలసీమ జోన్ కన్వీనర్ పి.ప్రభాకర్, బద్వేలు నియోజకవర్గ చైర్మన్ రవిచంద్ర, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రేమ్, నాయబ్, హాస్టల్ ఇన్‌చార్జి మునెయ్య, ఎస్సీ బాలికల హాస్టల్ ఇన్‌చార్జిలు విజయమ్మ, వెంకటేశ్వరమ్మ, కస్తూర్బా ఇన్‌చార్జి విజయలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డలు అదృశ్యం

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో తల్లీబిడ్డలు అదృశ్యమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన భరత్‌కుమార్ భార్య శశికళ(26), తన కుమార్తె చారు(1)తో కలిసి ఈ నెల ఆరవ తేదీన అదృశ్యమైంది. తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భర్తతో గొడవ పడింది. మనస్తాపంతో కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో గురువారం సాయంత్రం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలిక అదృశ్యం

బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాలెంకు చెందిన మైనర్ బాలిక అదృశ్యమైంది. ఆమె ఇంటర్మీడియెట్ చదువుతుండగా ఈ నెల ఆరవ తేదీన బాలిక తండ్రి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణంలోని కాలేజీ వద్ద దింపి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.